# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 23 జనవరి 2026


## కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు

చిన్నమండెం జనవరి 22 ప్రభాతవార్త:



మండలంలోని బోరెడ్డిగారి పల్లి లో గురువారం మంత్రి స్వగృహం నందు జిల్లా నలు మూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజల సమస్యలు, అర్జీదారులు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.. ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్శాలువ పుష్పగుచ్ఛములతో మంత్రిని సత్కరించినారు.

## జై శ్రీరామ్ నినాదంతో హోరెత్తిన రాజంపేట శోభాయాత్ర

రాజంపేట,జనవరి 22 ప్రభాతవార్త :

అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ జరిగి రెండేళ్లు పూర్తయి, మూడవ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గురువారంరాజంపేట పట్టణం లో ఈరోజు శ్రీరామ శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా ఆర్ఎస్ రోడ్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, డిగ్రీ కళాశాల రామాలయం వరకు శోభాయాత్ర కన్నుల పండుగగా జరిగింది. కాషాయ జెండాలతో జై శ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర వైభవంగా జరిగింది. శోభాయాత్రకు పెద్ద ఎత్తున యువకులు మోటార్ బైక్ లతో తరలివచ్చారు.



# సోభాయమానంగా రాములోరి శోభయాత్ర..

### కాషాయ తోరణమైన కడప నగరం.. రామనామ కీర్తనలతో మారుమ్రోగిన నగరవీధులు..

కడప కార్పొరేషన్ జనవరి 22 ప్రభాతవార్త:

కౌసల్య మాత దశరథ మహారాజుల గారాల ముద్దుబిడ్డ అయినా శ్రీరామచంద్రమూర్తి అయోధ్యలో భవ్యమైన దివ్య మందిరం నిర్మాణం, బలరాముడి ప్రాణతి ప్రతిష్ట జరిగి రెండేళ్ల పూర్తయిమూడో సంవత్సరం అడుగు పెడుతున్న సందర్భంగా కడప నగరంలో శ్రీరామ మహా శోభాయాత్ర శోభాయ మానంగా జరిగింది. ఎమ్మెల్యేలు మాధవి రెడ్డి, పుత్త కృష్ణ చైతన్య రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కడప మేయర్ పాకా సురేష్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి,



కార్పొరేటర్లు, అయోధ్య ఐక్యవేదిక నాయకులు, వి హెచ్ పి, ఆర్ఎస్ఎస్, రాముని దర్శించుకుని శోభయాత్రలో పాల్గొన్నారు. అయోధ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలో జరిగిన శ్రీరామ మహా శోభాయాత్రకు వేలాదిమందిగా హిందువులు తరలివచ్చారు. రాములోరి దివ్యమైన మంగళకరమైన ఆ విగ్రహాన్ని రామ భక్తులు హిందువులు మహిళామూర్తులు పిల్లలు కనులారా వీక్షించి తరించారు. కడప నగర వీధులు, కూడళ్లు అన్ని కాషాయ తోరణాలతో నిండిపోయాయి. జెండాలు, ఫ్లెక్సీలు కట్టారు. మెడలో కాషాయి కండువాలు ధరించి భక్తుల జై శ్రీరామ్ నినాదాలతో నగరవీధులు మారుమ్రోగి పోయాయి. మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు, కీర్తనలు, భరతనాట్యం కూచిపూడి వంటి నృత్యాలతో, వివిధ వేషధారణలో రామనామ కీర్తనలతో శోభాయమానంగా శోభాయాత్ర సాగింది. కడప చిన్న చౌక్ నుంచి అప్సర వై జంక్షన్, ఆర్టీసీ సర్కిల్, ఎస్పీ బంగ్లా రాజారెడ్డి వీధి నెహ్రూ పార్కు, కృష్ణా సర్కిల్, సెవెన్ రోడ్స్, గాంధీ బొమ్మ, కోటిరెడ్డి సర్కిల్, కాగితాల పెంట, ఐటిఐ సర్కిల్, సంధ్యా సర్కిల్ మహావీర్ సర్కిల్ మీదగా కోదండ రామస్వామి వరకు శోభయాత్ర సాగింది. అయోధ్య ఐక్యవేదిక నాయకులు, మహిళామృతులు, పెద్దలు, పిల్లలు, భక్తులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, వి హెచ్ పి, టిడిపి, వైసిపి, బిజెపి, జనసేన నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు.



## రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దాం

### మంత్రి మండిపల్లి

రాయచోటి జనవరి 22 ప్రభాతవార్త



ఈరోజు( శుక్రవారం) మంత్రి నారా లోకేష్ బాబు జన్మదినం సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రాయచోటి వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి, రక్తదానం చేయాలని ఆయన కోరారు. ఇలా రక్తం దానం చేయడం వలన ఇతరుల ప్రాణాలను కాపాడిన వాళ్ళం అవుతామని ఆయన తెలిపారు. కావున రాష్ట్రంలో ఎక్కడ ఎప్పుడు జరగని విధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రజలను తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆయన కోరారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలను పండగలా నిర్వహించాలి

### జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పండగ వాతావరణంలా ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. గురువారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు హాలు నందు గణతంత్ర వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లుపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లును వేధికను అందంగా అలంకరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధులు కుటుంబసభ్యులు, ఇతర అధిదులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానంగా ఆహ్వానించాలన్నారు. ప్రోటోకాల్ మేరకు ఆహ్వానపత్రికలను అందరికి పంపించాలన్నారు. పెరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లును ఘనంగా నిర్వహించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిభంబిస్తూ వివిధశాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షనీయంగా అందరిని ఆకట్టుకనేలా ఉండాలన్నారు. ఎగ్జిబ్యూషన్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, డిఎస్పి మహేంద్ర, ఏడి సర్వేయర్ భరత్‌కుమార్, ద్వారాపీడి వెంకటరత్నం, పిఆర్‌డిఏ పీడి నాగేశ్వర్‌రావు, డిఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీనరసయ్య, ఐసిడిఎస్ పీడి హైమావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న వెంకటేశ్వరుడు.

తంబళ్లపల్లె జనవరి 22 ప్రభాతవార్త ః



మండలం కోసువారిపల్లిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న టిటిడి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వెంకటేశ్వరుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం ధూప దీప నైవేద్యాలతో పలు రకాల పుష్పాలతో అలంకరించి స్వామివారిని ఉదయం కల్పవృక్ష వాహనం సాయంత్రం హనుమ వాహనంపై ఆలయ మాడవీధులు తోబాటు కోసువారిపల్లె పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, గోవింద నామ స్మరణం, పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో టిటిడి అర్చకులు కృష్ణస్వామి, రమేష్ స్వామి అర్చకుల బృందం, టిటిడి అధికారులు కృష్ణమూర్తి, నగేష్, మురళి వందలాదిమంది స్వామి భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

# విద్యార్థుల కడుపు నింపని వసతిగృహం

- చికెన్ పెట్టే రోజు వచ్చిందంటే అరకొర మాత్రమే
- ఉండేది 139 అయితే హాజరయ్యేది 50 మంది లోపే
- బిల్లులు మాత్రం 100మందికి పైగా
- కమిషన్ల అధికారులు తనిఖీలకు దూరం







బద్వేలు, జనవరి 22 ప్రభాతవార్త :

పేదవాడికి వసతిగృహం అంటే దేవాలయంతో సమానంగా భావించి అక్కడ విద్యతో పాటు ఇంటి వాతావరణాన్ని తలపించే బోజనాలు కూడా ఉంటాయని మధ్యతరగతి , వెనుకబడిన తరగతులకు నిలయంగా ఉండేదే ఈ గృహం. కాశినాయన మండలం, నర్సాపురం గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం వార్డన్ మాత్రం విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టకుండా అర్థాకలితో నిండేలా చేస్తున్నా అధికారులు మాత్రం అటువైపు వెళ్తున్న దాఖలాలు లేవు. అందరికీ కమిషన్లు ఇస్తున్నాం కదా మా వసతిగృహానికి తనిఖీకి ఎందుకు వస్తారు. అనే ధైర్యంతో మెనూలో మార్పు చేసుకని తనకు నచ్చినట్లుగా భోజనం పెడుతూ విద్యార్థులకు కడుపు నింపడంలేదు. ఈ మధ్యకాలంలో చికెన్ రేటు పెరిగిందనే సాకులు చెబుతున్నారు గాని, గత కొద్ది రోజులు చికెన్ 200లోపు ఉన్నప్పుడు కూడా 50 గ్రాములు ఒకో ౹ విద్యార్థికి అందని పరిస్థితి, ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం వసతిగృహంలోని ప్రతి విద్యార్థికి 100 గ్రాములు చికెన్ పెట్టాలని ఆరోజు పలావు అన్నంతోపాటు రుచికరమైన చికెన్ అందిస్తూ పెరుగు చెట్ని ఇవ్వాలని, వీటితో పండ్లు ఇవ్వాల్సి ఉంటుంది. నర్సాపురం దూరం అయినందున ఎవ రూ రారనే ధైర్యంతో చికెన్ బదులు పిల్లలకు పులుసువేసినా, పెరుగుచెట్ని బదులు మజ్జిగ వేసినా, బిర్యాని అన్నంలో బిర్యాని వాసన కనపడకపోయినా అడిగేవారు ఎవరూ లేరు. తనిఖీలు చేయాల్సిన ఏఎస్‌డబ్ల్యూఓ పగలు మాత్రమే తనిఖీకి వెళితే పిల్లలు ఉండరు కాబట్టి వెనుతిరిగి రావడం, రాత్రి ఎవరూ రారనే సాకుతో వార్డన్ పిల్లలకు ఏది పెడితే అదే తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారంలో మంగళ, శుక్ర, ఆదివారాలలో చికెన్ పెడుతుంటారు. ఆదివారం వచ్చిందంటే స్కూలుకు సెలవుదినం కావడంతో ఎవరూ ఉండరు కాబట్టి 10 మందికే అన్నంపెట్టి 100 మందికి బిల్లులు పెట్టుకోవడం జరు గుతుంది. ఇంత జరుగుతున్నా అదికారులు ఎందుకు స్పందించడంలేదో తెలియదు కాని ప్రతి విద్యార్తికి ప్రభుత్వం అందించే రూపాయిలో అధికారికి కమిషన్ అందుతుందనే ఉద్దేశ్యంతోనే వార్డన్లు ధైర్యంతో ఉంటున్నారని గతంలో పలువురు ప్రజాసంఘాలు ఎన్నోసార్లు ధర్నాలు చేశారు. నర్సాపురం మా రుమూల ప్రాంతమైనందున ఏ ఒక్కరూ తనిఖీకి వెళ్లరు. ఇక వార్డన్ ఆడిందే ఆట పాడిందే పాట ,ఏమి పెట్టినా విద్యార్థులు నోరెత్తలేని దుస్థితి. గతంలో కూడా ఈ వార్డన్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజ నం పెట్టరని సక్రమంగా వసతిగృహంలో ఉండరని అంతా అక్కడ పనిచేసే సిబ్బందిపై భారం మోపి వెళుతుంటారనే అపోహలు అనేకం ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులలో ఇలాంటి వార్డన్లపై నిఘా ఉంచా ల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తే పిల్లలకు వసతిగృహాలపై నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడడమే కాకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వసతిగృహాల అభివృద్ధిలో ఇలాంటివి కొన్ని మచ్చుకైనా ఉండడంతో చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వసతిగృహాలలో రాత్రి సమయాలలో పెట్టే భోజనంపై నిఘా ఉంచితే అక్కడ జరిగే పరిస్థితి అర్థమ వుతుంది. ఇలాంటి వసతిగృహాలు నియోజకవర్గంలోఅనేకం ఉన్నాయి.

## 'ఇస్తేమా'కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### - జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



కడప క్రైం, జనవరి 22, ప్రభాతవార్త:

ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఇస్తేమా జరగనున్న నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ చింతకొమ్మదిన్నె పరిధిలోని కొప్పర్తిలో వేదిక పరిసరాల్లో భద్రతా మరియు బందోబస్తు చర్యలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇస్తేమా జరిగే చుట్టూ పరిసరాలలో నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, భద్రతా మరియు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వివిధ ప్రాంతాల నుంచి ఇస్తేమాకు ముస్లింలు భారీగా తరలి రానున్న నేపథ్యంలో ముందుగానే పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ఆయా రూట్ల వెంట వచ్చే వాహనాలను ఎక్కడికక్కడే పార్కింగ్ చేసుకునే విధంగా మరియు సూచిక బోర్డులు, లైటింగ్, బారికేడ్ల ఏర్పాటు చేసుకోవాలని వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్దీకరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇస్తేమా కార్యక్రమానికి పెద్దఎత్తున ముస్లిం సోదరులు హాజరుకావడం జరుగుతుందని పోలీసు సిబ్బంది పూర్తి స్థాయిలో బందోబస్తుతో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం మరియు కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ప్రొద్దుటూరు ఏఎస్పీ విబు కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, జిల్లాలోని ఇతర జిల్లాల నుంచి బందోబస్తు విధులకు విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్‌అండ్‌బి రహదారుల అభివృద్ధికి

## 3 నియోజకవర్గాలకు 44.20 కోట్ల నిధులు

### వార్తతో ఆర్‌అండ్‌బి ఈఈ సహదేవరెడ్డి

రాజంపేట, జనవరి 22 ప్రభాతవార్త



రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి నియోజకవర్గాల్లో దెబ్బతిన్న ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 44.20 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో కూడా విడుదలైంది. ఇప్పటికే పలు పనులకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయి.మిగతా పనులకు కూడాటెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని రాజంపేట ఆర్ అండ్‌బి ఈఈ ఈ సహదేవరెడ్డి గురువారం వార్త కు తెలిపారు. రాజంపేట రాయచోటి రహదారి అభివృద్ధికి 2.75 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. మూడు కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులతో పాటు అభివృద్ధి పనులను రెన్యూవల్ చేస్తారు.అందులో భాగంగా వీరబల్లి మండలం పరిధిలోని బ్రిడ్జిని వెడల్పు చేసి అభివృద్ధి చేపడుతారు. అలాగే రాయచోటి సుండుపల్లె రోడ్డు అభివృద్ధికి మరో 2.75 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఏడు కిలోమీటర్లు పొడవైన రహదారిని రెన్యూవల్ చేస్తారు. ఇప్పటికే ఈ పనుల టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. గుండ్లూరు అత్తిరాలరోడ్డు అభివృద్ధికి 2.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 9 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేస్తారు. తొమ్మిది కిలోమీటర్లు పొడవైన ప్రధాన రహదారి నుంచి పులపత్తూరు రోడ్డుకు 2.26 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీరబల్లి వంగిమళ్ళ రోడ్డుకు 1. 30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. నాలుగు కిలోమీటర్ల పొడవైన రోడ్ల అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే పోలి ఊటుకూరు రోడ్డు అభివృద్ధికి 1.60 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో ఐదు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేస్తారు. రాజంపేటగూడూరు దుద్దిరాజుపట్నం రోడ్డులో 12 కిలోమీటర్ల పొడవైన రహదారి అభివృద్ధికి నాలుగు కోట నిధులు మంజూరు అయ్యాయి. రాయచోటి నియోజకవర్గం లో నిమ్మనపల్లె వాయల్పాడు గుర్రంకొండ గాలివీడు రోడ్డు అభివృద్ధికి నాలుగు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. 5.80 కిలోమీటర్ల రోడ్డును అభివృద్ధి చేస్తారు. రాయచోటి నియోజవర్గంలో దేవ పట్ల చిన్నమండెం రోడ్డు అభివృద్ధికి రెండు కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. 5.48 కిలోమీటర్ల పొడవైన రోడ్లు అభివృద్ధి చేస్తారు. రాజంపేట కదిరి తుంకూర్ రోడ్డు అభివృద్ధికి 3.50 కోట్ల నిధులు మం జూరు అయ్యాయి. ఈ నిధులతో 11.42 కి.మీ రోడ్డు అభివృద్ధి చేస్తారు. సిఆర్ఎ రోడ్ నుంచి ముక్క వారపల్లె ,సి బల్లి పల్లె రోడ్డు అభివృద్ధికి మూడు కోట్ల నిధులు మంజూరయ్యాయి. 14 కిలోమీటర్ల పొడవైన రహదారి అభివృద్ధి చేస్తారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో పెద్దవరంపాడు, వై ఎల్లాయపల్లె ఆశ్రమం మీదుగా పుల్లంపేట, రాచపల్లి ,గారాలమడుగు రోడ్డు అభివృద్ధికి 4.65 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి .ఈ నిధులతో 11.2 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేస్తారు. రాయచోటి నియోజకవర్గంలోఅలాగే ఆర్వి రోడ్ నుంచి కేజీ రోడ్డుకు పందిళ్ళపల్లి మీదుగా లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతర జరిగే ప్రాంతం వరకు వసంత వాళ్ల పల్లె కు 4.65 కోట్ల నిధులు మంజూరుతో 12.6 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేస్తారు. రాయచోటి నియోజవర్గంలో సికె రోడ్ నుంచి కేసాపురం మీదుగా పొలిమేరపల్లి బోనమల్ల రోడ్డు అభివృద్ధి చేసేందుకు నాలుగు కోట్ల నిధులు మంజూరయ్యాయి ఈ నిధులతో 14.60 కిలోమీటర్ల రోడ్డులు అభివృద్ధి చేస్తారు అలాగే చిట్వేలి నీరుంపల్లి రోడ్డు అభివృద్ధికి 2. 60 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి .ఈ నిధులతో ఎనిమిది కిలోమీటర్లు అభివృద్ధి చేస్తారు. మూడు నియోజకవర్గాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోయి మంజూరు చేయించారని ఈ ఈ తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గాలివీడు, జనవరి 22(ప్రభాతవార్త):



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం గాలివీడు మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల దగ్గర నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒకటిన్నర సంవత్సర కాలంలోని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎక్కువగా నెరవేర్చడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయని వాటిపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీడీపీ నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 75 ఏళ్ల వృద్ధుడికి మూడేళ్ల జైలు శిక్ష

రాయచోటి టౌన్ జనవరి 22 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లాలో మహిళలు, పిల్లల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న పోలీసుల కృషి మరోసారి ఫలించింది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కడప పోక్సో కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష మరియు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించింది. రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలిమాబాద్ వీధికి చెందిన షేక్ హరూన్ భాష (75) అనే వ్యక్తి, ఓ మైనర్ బాలికను నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి 10 ఆగస్టు 2023న ఫిర్యాదు చేయగా, అప్పటి రాయచోటి అర్బన్ ఎస్ఐ పి. నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన కడప పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. ప్రవీణ్ కుమార్, సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడిపై నేరం రుజు వైనట్లు నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడికి, 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ. 1000/ జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జిల్లాలో మహిళలు, పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన శిక్షలు తప్పవు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడటమే మా ప్రథమ ప్రాధాన్యత" అని స్పష్టం చేశారు. కొమ్మినేని వేణు గోపాల్: స్పెషల్ పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. నారాయణ: సబ్ ఇన్‌స్పెక్టర్ (తొలి దర్యాప్తు చార్జిషీట్ దాఖలు) ఎం.ఆర్. కృష్ణ మోహన్: డీఎస్పీ, రాయచోటి సబ్‌డివిజన్, బి.వి. చలపతి: సీఐ, రాయచోటి. కోర్టు సిబ్బంది: ఏఎస్ఐ ఎస్. వెంకటేశ్వర్లు (395), పిసి జి. సుధాకర్ (1620), మరియు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ వై. విశ్వనాధ యాదవ్ (2881). ను కేసు దర్యాప్తు నుండి శిక్ష పడే వరకు అంకితభావంతో పనిచేసిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ కొనియాడారు.

## పెద్ద జొన్నవరంలో పశువైద్య శిబిరం

దువ్వూరు, జనవరి 22, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ చలికాలంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వచ్చే వివిధ రకాల జబ్బులను గురించి యజమానులకు వివరించారు. ఈ శిబిరం నందు 777 జీవాలకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సీసనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**పీలేరు జనవరి 22 ప్రభాతవార్త:**

సీసనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, స్క్రబ్ టైపస్, అతిసార, వ్యాధులు మరియు టి. బి, క్యాన్సర్ వ్యాధులపట్ల అవగాహన కలిగి విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. మండలం లోని చింతపర్తి పి. హెచ్. సి. పరిధిలోని మంచూరు గ్రామంలో హాజరైన ప్రజలకు మరియు పాఠశాల విద్యార్థులు, డాక్టర్ జులేక బేగం, ఆధ్వర్యంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పాఠశాలలో హెచ్. ఎమ్.ప్రకాష్ అధ్యక్షతన కాలాను గుణంగా వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా,స్క్రబ్ టైపస్, అతిసారా, కళ్ళ కలగ వంటి జబ్బులపై మరియు టి. బి వ్యాధి,పై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు తాగునీటిని కాచి చల్లార్చి త్రాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు వస్తే ప్రభుత్వ అస్పత్రులకు రావాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆర్.ఎమ్.పీ ల దగ్గరికి వెళ్లి వచ్చిరాని వైద్యం చేయించుకుని ప్రాణం పైకి తెచ్చుకోరాదన్నారు. గురువారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఇచ్చే ఐరెన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. స్క్రబ్ టైపస్ జ్వరాల గురించి విశదీకరించి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అవగాహన కల్పించడం జరిగింది. ఆరోగకరమైన జీవన శైలి పాటించాలి అన్నారు. చేతుల శుభ్రత లోని ఆరు దశలను చేసి చూపించి విద్యార్థులచే చేయించారు. పరిశుభ్రతే ఆరోగ్యం, ఆరోగ్యమే ఆయుస్సు అన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేసి గురువారం మెనూ ప్రకారం కూరగాయల అన్నం చాలా బాగుంది అని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సి. హెచ్.ఓ. వనిత ఏ.ఎన్.ఎమ్.వాణి,హెల్త్ అసిస్టెంట్ వలిసాబ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి మృతి

**బద్వేల్ అర్బన్ జనవరి 22 ప్రభాతవార్త :**



విజయ ఇన్ఫ్రా యం,యస్,ఆర్ టిప్పర్స్ యజమాని ముమ్మడి రెడ్డి నాగేంద్ర రెడ్డి తండ్రి ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి (75) గురువారం మృతి చెందారు, వివరాల్లోకి వెళితే ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి 8 నెలల క్రితం ఇంటి నుండి పొలంకు వెళుతూ కిందపడి వెన్నెముక పూర్తిస్థాయిలో డ్యామేజ్ అయింది, అప్పటినుండి హాస్పిటల్లో చికిత్స పొందుతూ మంచానికే పరిమితమయ్యారు. చివరిగా వారి స్వగ్రామమైన ఓబులాపురంలో వారి తుదిశ్వాస వదిలినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు, నియోజకవర్గంలో ముమ్మడి రెడ్డి నారాయణరెడ్డి రైతు అనేకమందితో మంచితనంగా ఉంటూ అందరితో కలిసి మెలిసి ప్రేమ అపాధిగా అందరిని పలకరిస్తూ ఉండేవారు ఒక్కసారిగా వారు మృతి చెందిన విషయం తెలియగానే పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు, నాగేంద్రారెడ్డి అందరికీ సుపరిచితులు కాబట్టి వారి తండ్రి మరణం విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, ఆయా శాఖల అధికారులు పలువురు రైతులు మృతి చెందిన నారాయణరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు, నేడు శుక్రవారం కాశీనాయన మండలం ఓబులాపురంలో మధ్యాహ్నం ఒంటిగంటకు అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఈ నెల 23 న జాతీయ ఓటర్ల దినోత్సవం

**కడప,జనవరి 22 ప్రభాతవార్త**

కేంద్ర ఎన్నికల సంఘం మరియు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు జనవరి 25 ఆదివారం ప్రభుత్వ సెలవు కావడం వలన జిల్లా లోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు సంస్థలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ను 23 జనవరి 2026 (శుక్రవారం ) జరపవలసినదిగా ఆదేశాలు అందాయని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ విశ్వేశ్వర నాయుడు గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర కార్యదర్శిగా పురుషోత్తం

**పీలేరు జనవరి 22 ప్రభాతవార్త:**



భారతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చేతుల మీదుగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అనంతల సురేష్ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాపై నమ్మకంతో నాకు ఇచ్చినటువంటి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతను గ్రామీణ ప్రాంతంలో పేద బడుగు బలహీన వర్గాల అన్నిటినీ కలుపుకొని దళితుల పక్షాన పోరాటం చేస్తూ భారతీయ జనతా పార్టీ ఎదుగుదలకు నా వంతు కృషి చేస్తానని నాపై రాష్ట్ర పార్టీ ఉంచినటువంటి నమ్మకాన్ని బాధ్యతను తూచ తప్పకుండా నిర్వర్తిస్తూ భారతీయ జనతా పార్టీ ఎదుగుదలకు అన్ని విధాల పనిచేస్తానని ఎన్నికకు సహకరించినటువంటి మా అన్న పులి నరేంద్ర కుమార్ రెడ్డి భారతీయ జనతా పార్టీకి నా సహచర నాయకులు కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## ఎస్సి, ఎస్టి దాడులు పట్ల ప్రభుత్వ తీరు మారాలి

### బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు

**మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :**


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

ఎస్సి, ఎస్టి దాడులు పట్ల, సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ తీరు మారాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు కోరారు. గురువారం పట్టణంలోని బహుజనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతూ బిసిల రక్షణ చట్టం కోసం అసెంబ్లీ తీర్మాణం ఆమోదం పొందించి చిత్తశుద్ధి నిలుపుకోవాలన్నారు. ముస్లిం, క్రిస్టియన్ల దాడుల పట్ల కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల తరహాల్లో రక్షణ చట్టం చేయాలన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, ముస్లిం, క్రైస్తవులను కలుపుకొని ఫిబ్రవరి 5న చలో కుప్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ముస్లిం, క్రిస్టియన్లపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. కుప్పంలో నిర్వహించే రాజ్యాంగ హక్కుల సదస్సుకు అన్ని వర్గాల వారు విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజనసేన నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, రాఘవేంద్రయాదవ్, బురుజు శంకర్, భానుప్రకాష్, వెంకటేష్, శ్రీరాములు, మైనార్టీ నాయకులు మహమ్మద్, కోనేటి సాంబ తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ నిధులు రూ.40కోట్లు వెనక్కి తెప్పించాలి

**మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :**

మున్సిపల్ సాదారణ నిధులు రూ.40కోట్లు ప్రభుత్వం దారి మళ్ళించిందని ఈ నిధులను వెనక్కి తెప్పించాలని వైకాపా కౌన్సిలర్లు నిరసనలు వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కౌన్సిలర్లకు సహకరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అనంతరం మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి గతంలో ఎక్స్‌ఆఫిసియా హోదాలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై పట్టణాభివృద్ధికి రూ.40కోట్లు కాదు రూ.400కోట్లు అయినా ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే అప్పట్లో ఇచ్చిన హామీ మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ కౌన్సిల్‌హాలులో వైకాపా కౌన్సిలర్లు అందరూ బైఠాయించి నిరసనలు వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఒక్క రుపాయి కూడా మంజూరు చేయించలేదని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటిలో శానిటేషన్ అధ్వాన్నంగా ఉందని కౌన్సిలర్ ఖాజా తెలిపారు. వైసిపి హాయాంలో పట్టణం పరిశుభ్రంగా ఉండేదన్నారు. వార్డుల్లో సమస్యలపై సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ కదిరిరోడ్డులో మాస్టర్‌ప్లాన్ ప్రకారం డ్రైనేజి పనులు చేపట్టాలన్నారు. కమీషనర్ ప్రమీల మాట్లాడుతూ రూల్ 70ప్రకారం కలెక్టర్ అనుమతితో పనులు చేస్తున్నామని తెలిపారు. వైసిపి కౌన్సిలర్లు పలు సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.



## ఇంటింటా వైద్య ఆరోగ్య సర్వే

**నందలూరు , జనవరి 22 ప్రభాత వార్త :**



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె. శరత్ కమల్, సి. హెచ్.ఓ. వెంకటనారాయణలు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అరవపల్లె, గాంధీ నగర్, గురజాడ నగర్ ప్రాంతాలలో ఇంటింటా తిరిగి ప్రజల ఆరోగ్య వివరాల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి దోమల నిర్మూలన కోసం లార్వా నివారణ పిచికారీ చేయించారు. గాంధీ నగర్ ప్రాంతంలో చెరువు నీరు అధికంగా నిల్వ ఉండటంతో అక్కడ క్రిమిసంహారక మందులు చల్లడం సాధ్యం కాదని వైద్యులు తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా జ్వర కేసులను గుర్తించినట్లు తెలిపారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి, ఎం.ఎల్.హెచ్.పి. సులోచన, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సెఫ్టీపై రవాణాశాఖచే అవగాహన సదస్సు

**మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :**


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ రహదారి భద్రతా మాసం 2027లో భాగంగా రవాణాశాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా మదనపల్లె పట్టణంలో గురువారం రోడ్డు సెఫ్టీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు వినియోగం, తదితర రహదారి భద్రతా చర్యల ప్రాధాన్యతను వివరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదం తగ్గడమే కాకుండా ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గించవచ్చునన్నారు. వాహనదారులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి మహేంద్ర, ఆర్టీఓ ఆశోక్‌ప్రతాప్‌రావు, ఎంవిఐలు వినయ్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరిలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ దుర్మరణం

**కలికిరి, జనవరి 22, ప్రభాతవార్త:**

పీలేరు-కలకడ రోడ్డు మార్గంలోని టి.సంద్రవారిపల్లి బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందిన సంఘటన కలికిరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు కలకడ వైపు నుంచి పీలేరు వైపు వెళ్లే వాహనం రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొనడంతో ఆమెకు బలమైన రక్తగాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. కానీ ఆమె ఆచూకీ తెలియరాలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చిన వెంటనే కలికిరి ఏఎస్సై నరసింహులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లడం జరిగింది. కానీ అప్పటికే మహిళ మృతి చెందడం జరిగింది. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. కలికిరి సిఐ రామచంద్ర ఆదేశాల మేరకు ఏఎస్సై నరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిఆర్‌పిలతో సమీక్ష సమావేశం

**రామసముద్రం జనవరి 22 ప్రభాతవార్త**



మండల కేంద్రం శ్రీ శక్తి భవనంలో గురువారం చెంబకూరు 14వి వోలకు సంబందించిన వి ఓఏలతో ఈ నారీ మణులు సిఆర్‌పిలతో డిపిఎం లక్ష్మీప్రసాద్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఈనారీ మణులు, సిఆర్‌పిల ఆవశ్యకత, చేయవలసిన పనులు,చేయకూడని పనులు గురించి క్లుప్తంగా వివరించారు పుస్తకాల ఆవశ్యకత, వ్రాసే విధానం, అనెక్షర్ 1,2 గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం కు డీపీఎం లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మండల ఏపీఎం సాంబశివ సిసిలులు,అకౌంటెంట్, మండల సమాఖ్య ఓ.బి.లు, వి.ఓ.ఏ.లు,ఈ నారీమణులు, సిఆర్‌పిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయరహదారి భద్రత పై అవగాహన ర్యాలీ

**ములకలచెరువు, జనవరి22, ప్రభాతవార్త:**



డ్రైవర్లకు జాతీయ రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ కల్పించారు. సందర్భంగా స్థానిక సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రహదారి భద్రత, ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వాహనాలు నడిపేవారు రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. గురువారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో కె సివిఆర్ కంపెనీ వారి ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగంగా వాహనాలను నడపరాదని, లైసెన్స్ లేకుండా వాహనదారుడు తప్పనిసరిగా ఉండాలని, హెల్మెట్, మరియు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, డి ఈ. మధుసూదన్, కె సివిఆర్ కంపెనీ మేనేజర్ మనోజ్ రెడ్డి, హైవే సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పరీక్షలు

**కలికిరి, జనవరి 22, ప్రభాతవార్త:**

కలికిరి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం పరీక్షలు నిర్వహించడం జరిగింది. విద్యావికాస్ సేవా సమితి పేరుతో రామాయణ పరీక్షలు మదనపల్లి పరిధిలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాల బాలికలకు శ్రీరామచంద్రుని గుణగణాలు, రామాయణంలోని ఆదర్శాలు, భారతీయ సంస్కృతి, నైతిక విలువలు తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యం. ఈ రామాయణ పరీక్షలు మదనపల్లి, తంబళ్లపల్లి, కలికిరి, వాల్మీకిపురం పరిసర ప్రాంతాల్లోని సుమారు 16 పాఠశాలల్లో నిర్వహించబడుతున్నాయి. ఈ పరీక్షలలో దాదాపు 1830 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేకంగా రామాయణానికి సంబంధించిన పుస్తకాలు, ప్రశ్నాపత్రాలు అందించడమే కాకుండా, ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న పాఠశాల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వహిందూ పరిషత్ మదనపల్లి సమితి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటుహక్కుపై విద్యార్థులచే అవగాహన ర్యాలీ

**మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :**



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలక్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ఓటుహక్కుపై పోటీ పరీక్షలు, క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి ఓటర్లు అని ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగం తెలుసుకొని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సేగు రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరునికి ఓటుహక్కు అనే ఒక వజ్రాయుదాన్ని ప్రసాదించిందన్నారు. ఓటుహక్కును ప్రతి పౌరుడు నిజాయిగా వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు శంకర్‌రెడ్డి, పివి. రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందులలో పాముల భయం లేదు..

**పులివెందుల జనవరి 22, ప్రభాత వార్త :**



నియోజకవర్గంలో ఎక్కడైనా సరే పాము కనిపిస్తే ఒక్క ఫోన్ చేస్తే వచ్చి పట్టుకుంటానని స్నేక్ క్యాచర్ సుదర్శన్ రెడ్డి భరోసా ఇచ్చారు. పులివెందుల నియోజకవర్గం గురజాల గ్రామానికి చెందిన రైతు రవి తోటలో పెద్ద పాము సంచరిస్తోందని సమాచారం అందడంతో స్పందించిన సుదర్శన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పొదల మధ్య దాగి ఉన్న భారీ కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా పాములు కనిపించి ఇబ్బంది కలిగిస్తే +91 98666 60195 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనవసరంగా ఫోన్ చేయవద్దని, నిజంగా పాము ఉన్నప్పుడే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## ఘనంగా సదమమ్మకు పూజలు

**సదుం జనవరి 22 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఎర్రాతివారిపల్లెలో వెలసిన శ్రీ చదుమమ్మ ఆలయంలో గురువారం అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, ఎండపల్లి మనోహర్ రెడ్డి, ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, మండల వైసీపీ నాయకులు పెద్ది రెడ్డి. వేణు గోపాల్ రెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి వినతి..

**సుండుపల్లె, జనవరి 22,ప్రభాతవార్త :**

మండలంలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్,ఎంపీఎస్ నాయకులు వినతిపత్రాన్ని మంతల రెవిన్యూ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మండల ఎంఎస్పి నాయకులు గొల్లపల్లి నాగరాజ మాట్లాడుతూ రైతులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆన్లైన్లో జరుగుతున్న సమస్యలు యఫ్ లైన్ చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లాలు మారడంతో సమస్యలు ఎక్కువ అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారని జిల్లా కలెక్టర్,ఆర్డీవో, మాన్యువల్ విధానంలోనైన రైతులకు చలానాలు ఆన్లైన్ సమస్యలు పరిష్కరించాలని రైతుల అవసరాలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు గద్దం నాగలేసు,ఓబగాళ్ళ నాగేష్, ఎంర్పీస్ గౌరవ సలహాదారులు వీరనాగయ్య, చంద్రప్పనాయుడు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలే క్రీయాశీలకం

### వైకాపా సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్

**రామసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త :**


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తలు క్రీయాశీలకమేనని మదనపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త నిస్సార్‌అహ్మద్ తెలిపారు. గురువారం రామసముద్రం మండల వైఎస్ఆర్ సిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని పార్టీ పరిశీలకులు తట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో బలోపేతం చేయడమే లక్ష్యం అన్నారు. పార్టీకి నిబద్ధతగా నిరంతరం పనిచేసే కార్యకర్తలనే గ్రామ కమిటీల్లో నియమించాలని సూచించడం జరిగిందన్నారు. పార్టీ భవిష్యత్తు పూర్తిగా కార్యకర్తల చేతుల్లోనే ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు సాధారణ ఎన్నికల్లో కూడా కమిటీల్లోని కార్యకర్తలే పార్టీకి బలంగా నిలవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ వైకాపా జెండా రెపరెపలాడించాలన్నారు. ఈ కార్యక్రమంలో తట్టి శ్రీనివాసులురెడ్డి డాక్టర్ అనీల్‌రెడ్డి, కేశవరెడ్డి, రమణారెడ్డి, గెవెన్న, సిహెచ్.రామచంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, సిహెచ్ ప్రకాష్, రెడ్డివీరగౌడ్; తిమయ్య, మాధవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, దర్శన్‌గౌడ్, బాలాజి తదితిరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని నిరాహారదీక్ష

**జమ్మలమడుగు, జనవరి 22, ప్రభాతవార్త:**



కడప ఎగ్జిక్యూటీవ్ నిరంకుశ వైఖరికి నిరసనగా ఎన్ఎంయూఏ కడప జోనల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జమ్మలమడుగు డిపో కార్యదర్శి ఎంజీసీఓ రెడ్డి ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహారదీక్షా శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ 1/2019 సర్కులర్లు వెంటనే అమలు చేయాలని, డ్రైవర్లు, కండక్టర్లు మరియు మెకానిక్‌లకు సంబంధించి న్యాయప్రక్రియ ద్వారా ఉన్న అడ్డంకులను తొలగించి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. తిరుపతి మరియు కడప జిల్లాలలో సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని కడప జోన్ నందు అన్ని గ్యారేజీలలో అసిస్టెంట్ మెకానిక్ డిప్యూటీ మెకానిక్, మెకానిక్, ఆర్టిజన్స్, లీడింగ్ హ్యార్ పదోన్నతులను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. జోన్ నందు మహిళా సిబ్బందికి ఉన్న రెస్టు రూమ్‌లలో సరైన వసతులు కల్పించాలని జోన్ నందు ఉన్న మహిళా సిబ్బందికి జీవో ఎంఎస్ నెంబరు 70 ప్రకారం చైల్డ్ కేర్ లీవ్‌లను మంజూరు చేయాలని కోరారు. జోన్ వ్యాప్తంగా సిబ్బందికి చెల్లించాల్సిన నెల ఇన్సెంటివ్ సకాలంలో చెల్లించాలని కేంద్ర కార్యాలయం ఇచ్చిన నోటిఫికేషన్ నెంబరు 16/2023 ప్రకారం జోన్‌లో అన్ని డిపోలలో ప్రతి నెలా గ్రీవెన్స్‌డే నిర్వహించాలన్నారు. దీక్షా శిబిరం వద్దకు జోన్ కమిటీ మెంబర్ ఎస్ఎం వలీ, ఒరిజినల్ కమిటీ వ మెంబర్లు పీఎస్ వాసులు, మోహన్‌రెడ్డి, డిపో ఉపాధ్యక్షులు కాంతయ్య, గ్యారేజీ అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రుడు, బ్రహ్మం, మహిళా సోదరీమణులు దియా, మరియు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏడవ వార్షికోత్సవం

**పులివెందుల, జనవరి 22 , ప్రభాత వార్త :**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కదిరి రోడ్డులో డంపింగ్ యార్డ్ వెళ్లే రహదారిలో కొలువై ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు షరీఫ్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఈ కార్యక్రమా లు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేడుకలలో భాగంగా ఉదయం వేద పండితులచే స్వామివారికి పంచామృ తాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభయ ఆంజనేయ స్వామిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.అనంతరం అభయ ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని ఎత్తుకొని ఆలయ ప్రాంగణంలో స్వామి నామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు షరీఫ్ మాట్లాడుతూ భక్తుల సహాయ సహకారాలతో ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే గురువారం ఏడవ వార్షికోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి భక్తులు మరింత సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీని బలోపేతం చేయడమే లక్ష్యం

**కేవీ పల్లె జనవరి 22 ప్రభాతవార్త:**

గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జిల్లేళ్లమంద, నూతనకాల్వలో వైఎస్సార్సీపీ రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లేళ్లమంద, తాండ, నూతనకాల్వ గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. గ్రామ స్థాయిలో వివిధ విభాగాలలో పదవులు కల్పించారు. పదవులు పొందిన వారిలో ఎం. ప్రభాకర్రెడ్డి. నాగయ్య. మల్లికార్జున, కె. చంద్రయ్య. స్టూడియో వెంకటేష్, కొండారెడ్డి, ఎన్. నీరజ, గణపతిరెడ్డి, కె. సుబ్బయ్య. ఎ. హరి, చంద్రానాయక్, రెడ్డినాయక్. బి. జయరామ్ నాయక్, శివశంకర్నాయక్. 2. మోహనా నాయక్. బాబునాయక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, నాయకులు పి. ద్వారకనాథరెడ్డి, చిన్నయ్యగ్రమరెడ్డి, రత్నాకర్రెడ్డి, చామంచుల సిద్ధయ్య. బాలకృష్ణ, గౌస్, నాగ, అమీర్ బాషా, వెంకటరమణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణలో ప్రహరీ గోడ తొలగింపు

**మైదుకూరు, జనవరి 22, ప్రభాతవార్త:**



మైదుకూరు మరియు పోరుమామిళ్ల రహదారిలో మార్కెట్ దగ్గర అంకాలమ్మ దేవాలయం ఆవరణ ప్రహరి గోడను రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జెసిబితో తొలగించడం జరిగింది. అంకాలమ్మ భక్తులు మాత్రం రోడ్డు విస్తరణ అనంతరం నిర్మించే ప్రహరీ గోడ నాణ్యత నిర్మాణంతోపాటు దేవాలయ నిర్వహణ ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి రోడ్డు వైపున చిన్న రూములు ఏర్పాటు చేస్తే బాడుగల్ వస్తాయని, అంతేకాకుండా రూముల నిర్మించడంతోపాటు నిర్వహణ బాధ్యతలు ఆలయ పెద్దలు తీసుకొని చేపడితే అంకాలమ్మ దేవాలయానికి నిధులు సమకూరుతాయి. అంకాలమ్మ తిరుణాల జరపాలంటే ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి రూములు నిర్మించడం వాటిని బాడుగకు ఇవ్వడంతో పాటు కొంతవరకు నిధులు సమకూరుతాయని ప్రజల అభిప్రాయం.

## కస్తూరిబాయి స్కూల్‌ను సందర్శించిన జిసిడిఒ

**సుండుపల్లె, జనవరి 22, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని కస్తూరి బాయి గాంధి స్కూల్ ను కడప జిసిడిపిఒ రూతు ఆరోగ్య మేరీ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తో మమేకమై 10 వ తరగతి 100 శాతం ఉత్తీర్ణత పెంచాలని ఉపాధ్యాయులు కు తెలియజేసారు. అనంతరం గదులను, స్నానపు గదులను, వంటసాలను పరిశీలించారు.

## పెన్షనర్ల అకౌంట్లో పడని డిప నిధులు

**రాజంపేట, జనవరి 22 ప్రభాతవార్త:**

2018 డి ఏ అరియర్స్ ఇంకా కొంతమందికి బ్యాంక్ అకౌంట్లో పడనందున ఏ టి ఓ రవికుమార్ను కలిసి పెన్షన్ సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. 2018 డి ఎ అరియర్స్ కొంతమంది పెన్షనర్స్ కి ఇంకా వారి అకౌంట్లో పడలేదు అందువలన వాళ్ళు ఆందోళన చెందుతున్నారు ఈ విషయమై చర్చించుటకు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య నాయకత్వంలో ఏటిఓ రవికుమార్ ను కలిసి చర్చించారు. ఈ విషయమై సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏటిఓ రవికుమార్ కి అసోసియేషన్ డైరీని బహుకరించారు. అలాగే రాజంపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఫాతిమాతో కూడా పెన్షనర్స్ సమస్యలను చర్చించారు. ఒక కౌంటర్ పేన్షనర్స్ కోసం ప్రత్యేకమైనటువంటి కౌంటర్లు ఏర్పాటు చేయమని కోరగా దీనికి ఆమె అంగీకారం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఆర్ఓ ఈశ్వరయ్య, చలపతి, కేశవులు, నరసింహులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఏ సభ్యత్వ కార్యక్రమంతో ఉపాధ్యాయ చైతన్యం

**బద్వేలు, జనవరి 22, ప్రభాతవార్త**




గోపవరం మండలంలో నేషనల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మానుగుంట రవిశంకర్, మండల అధ్యక్షులు దగ్గుబాటి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి కూరాకు రవి పాల్గొని ఉపాధ్యాయులతో నేరుగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బీవీ ఆర్ నగర్, వల్లెరవారి పల్లె మోడల్ స్కూల్స్, మహమ్మద్ కాలనీ, కోటిరెడ్డి నగర్ ఉన్నత పాఠశాలలు, అలాగే సాయి నగర్, మడకలవారిపల్లె, వల్లెరవారి పల్లె , మడకలవారిపల్లె, సోత్రీయ రామాపురం, ఆరోగ్యపురం తదితర ప్రాథమిక పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు క్యాలెండర్లు, స్టిక్కర్లు, డైరీలు అందజేశారు. విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇచ్చిన ఆత్మీయ స్వాగతానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## భూమి పూజ కార్యక్రమం లో పాలుగోన్నా అది, బుపేష్

**యర్రగుంట్ల : జనవరి 22 ప్రభాతవార్త**



మండల పరిధిలోని చిలమకూరు గ్రామం నందు గురువారం రూ. 1.85 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులనులకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి టీడీపీ జిల్లా అధ్యక్షులుభూపేష్ రెడ్డి ,చదిపిరాళ్ళ సుధీర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వరెడ్డి, అధికారులు , వైద్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, చిలమకూరు గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

**డాక్యుమెంట్ పోయినది**

ప్రవీణ్ వర్మ ఆర్ఎస్ తండ్రి ఆర్ రామరాజు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, డి.నెం.ఎల్ఐజిహెచ్, 2-208, ఏపీ హెచ్బి కాలనీ, రామాలయం దగ్గర కడప సిటీ ,వైఎస్ఆర్ కడప జిల్లా. నా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.72/2018, 7రోడ్లు జిరాక్స్ సెంటర్ దగ్గర పోయినది. దొరికినచో క్రింది నెంబర్కు తెలుపగలరు. సెల్: 94917 11345.

# సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగుల నిరాహార దీక్ష

మైదుకూరు, జనవరి 22, ప్రభాతవార్త:



జిల్లాలో అన్ని డిపోల యందు ఆర్టీసీ ఉద్యోగుల సభ్యుల నిరాహార దీక్షలో భాగంగా మైదుకూరు ఆర్టీసీ ఉద్యోగులు నిరాహార దీక్ష శిబిరంలో వారి సమస్యలను పరిష్కరించాలని అమలు చేయాలని కోరారు. అనంతరం వారు మాటాల్డుతూ ఉద్యోగ భద్రత సర్కులర్ 1/19 ను వెంటనే అమలు,డ్రైవర్లు కండక్టర్లు మరియు మెకానిక్స్ ప్రమోషన్స్ కు సంబంధించి న్యాయ ప్రక్రియ ద్వారా ఉన్న అడ్డంకులను తొలగించి వెంటనే ప్రమోషన్స్, తిరుపతి మరియు కడప జిల్లాల నందు సిబ్బంది సమస్యలు,జోన్ నందు అన్ని గ్యారేజీ లలో అసిస్టెంట్ మెకానిక్, డిప్యూటీ మెకానిక్, మెకానిక్, ఆర్టిజాన్స్, లీడింగ్ హ్యాండ్ పదోన్నతులను చేపట్టడం, కేటగిరీల్లో ఖాళీలను ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయడం, కడప వ్యాప్తంగా ఆర్టీసీ సిబ్బందిపై జరుగుతున్న దాడులను ఆపడం, అన్ని కేటగిరీల్లో డి.ఆర్. కోటా పేరుతో నిలుపుదల చేసిన డిప్యూటీ సూపరింటెంట్ ఖాళీలను ప్రమోషన్ కోటతో తక్షణమే భర్తీ చేయడం, అన్ని క్యాటగిరి లకు సంబంధించి గ్రేడ్ 1 ప్రమోషన్స్ మంజూరు చేయడం,అన్ని కేటగిరీలకు ఏ ఏ ఎస్ స్పెషల్ గ్రేడ్ల మంజూరు చేయడం,ఇప్పటికే మంజూరు చేసిన 6 ఇయర్స్ 12 ఇయర్స్ స్పెషల్ గ్రేడ్స్ ను కొందరికి అసంబద్ధమైన కారణల తో నిలుపుదల చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం, జోన్ పరిధిలో శాంక్షన్ మేరకు ఏ.డి, పి.డి,ఓ.పి.డి, ఎం.ఈ.డి, ఎస్. పి.డి విభాగాల నందు ఉన్న ఖాళీలను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయడం, జిల్లా అధికారుల వద్ద ఉన్న అప్పీల్స్ అన్ని సకాలంలో సానుకూలంగా పరిష్కరించడం, టెక్నాలజీకి అనుగుణంగా మెయింటెనెన్స్ విభాగం నందు టూల్స్ మరియు మెటీరియల్స్ తెప్పించడం, మహిళా సిబ్బందికి ఉన్న రెస్ట్ రూమ్స్ నందు సరైన వసతులు కల్పించడం, మహిళా సిబ్బందికి జి.ఓ. ఎం.ఎస్ .నెం:70 ప్రకారం చైల్డ్ కేర్ లీవులను మంజూరు చేయడం,ఆఫీసులలో ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, అనంతపురం, అన్నమయ్య మరియు నంద్యాల జిల్లాలకు సంబంధించి నూతన డి.పి.టి.ఓ. ఆఫీసుల నిర్మాణం చేపట్టడం, మడకశిర డిపో నందు డిపో మేనేజర్ కార్యాల నిర్మాణం కొరకు తక్షణ చర్యలు చేపట్టడం, ,కేంద్ర కార్యాలయం ఇచ్చిన నోటిఫికేషన్ న్నె:16/2023 ప్రకారం జోన్ నందు అన్ని డిపోలలో ప్రతినెల గ్రీవెన్స్ డే నిర్వహించడం, తేది17. 07.2022 నుండి తేది 31 .0 8. 20 22 వరకు సిబ్బందికి చెల్లించవలసిన ఓ.టి మరియు డేఔట్ అలవెన్సను వెంటనే చెల్లించాలని ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి వి.ఎస్.రాయుడు, యం.వి.రావు, ఎన్.పోలయ్య, జి.ఎస్.రెడ్డి,బి. యం.రెడ్డి, శంకర్ రెడ్డి, యాసిన్, ఆంజనేయులు,వాసులు,యు.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికై డిమాండ్

పీలేరు జనవరి 22 ప్రభాతవార్త:



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం వద్ద ఆర్టీసీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కడప జోనల్ కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ ఉద్యోగులు గురువారం అన్ని ఆర్.టి.సి డిపోల కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అందులో భాగంగానే పీలేరు డిపోలోనూ కడప జోనల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి. ఆనంద ఆధ్వర్యంలో "రిలే నిరాహార దీక్ష" చేపట్టారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం ఒరియో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదటి రోజు రిలే నిరాహార దీక్షలో బి. ఆనంద, కె. హరి, ఏజి నాయుడు, బి. శివశంకర్, జయంతి, పి. రోజారమణి, ఎం. రమేష్, పి. బావాజాన్, బివిఎన్ నాయక్, బి. సహదేవ నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ నాయకులు, డిపో అధ్యక్షులు సివి రమణ, డిపో సెక్రెటరీ జి. ఆదినారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 22 ప్రభాతవార్త

నేతాజీ సోషల్ క్లబ్ కడప జిల్లా వారు నేడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప జిల్లాస్థాయిలో పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష కార్యక్రమాన్ని ప్రొద్దుటూరులోని కృష్ణ దేవాలయం ఫంక్షన్ హాల్ నందు నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోషల్ క్లబ్ జిల్లా కన్వీనర్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రతిభా పరీక్షలో ప్రథమ బహుమతిగా 5000 రూపాయలు, రెండవ బహుమతిగా 4000 రూపాయలు, మూడో బహుమతిగా 3000 రూపాయలు మరియు 15 కన్సోలేషన్ బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సోషల్ క్లబ్ అధ్యక్షులు గురుకుమార్ మాట్లాడుతూ ఈ ప్రతిభా పరీక్షలో జిల్లావ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 150 మంది పాఠశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి షాబుద్దీన్, జింకా సుబ్రహ్మణ్యం, నాగరాజు, కృష్ణ మోహన్ రావు, ఫయాజుద్దీన్, వన్నప్ప, సుబ్బయ్య, జమాల్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

నందలూరు, జనవరి 22 ప్రభాత వార్త :



క్రీడలు మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వానికి దోహదపడతాయని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ తెలిపారు. టంగుటూరు గ్రామంలో నిర్వహించిన శ్రీ వినాయక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ఆయనతో పాటు సింగిల్ విండో అధ్యక్షులు పసుపులేటి ప్రవీణ్ కుమార్, మండల కో-క్లస్టర్ ఇంచార్జ్ చుక్కా యానాది, సర్పంచ్ మైనుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫైనల్లో టంగుటూరు జట్టు విజేతగా నిలిచగా, సాతపల్లి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు రూ. 20 వేల మొదటి బహుమతి, రూ.15 వేల రెండో బహుమతితో పాటు ట్రోఫీలు అందజేశారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రీడలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

## హెమటాలజీ సేవలను అందిస్తాం..

కడప కార్పొరేషన్, జనవరి 22 ప్రభాతవార్త:




హెమటాలజి, బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ యూనిట్లో లుకేమియా లింఫోమాస్ మల్టీపుల్ మైలోమా అప్లాస్టిక్ అనీమియా తలసీమియా సికిల్ సెల్ డిసీస్ వంటి కాన్సర్, రక్త రుగ్మతులకు పెద్దలు, పిల్లలకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు హెమటాలజిస్ట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ తో ఇప్పటి వరకు 450 మందికి పైగా విజయవంతమైన బీఎంటీ లను నిర్వహించినట్లు వెల్లడించారు. గురువారం కడపలోయశోద మెడికల్ సెంటర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు చెందిన 65 సంవత్సరాల వృద్ధురాలకు మల్టీపుల్ మైలోమా అని నిర్ధారించామని వెల్లడించారు. ఈ వ్యాధికి 4 నెలల కీమోథెరపీ ఇచ్చి వ్యాధి తగ్గిందని చెప్పారు. ఆటోలాగస్ బోన్ మారో ట్రాన్స్ప్లాంటేషన్ విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి హెమ టాలజి సేవలను అందించడమే లక్ష్యంగా యశోద హాస్పిటల్స్ లో కిచ అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నాల్గవ గురువారం యశోద మెడికల్ సెంటర్ కడపలో అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సి.శ్రీనివాస రెడ్డి, యు. పెంచలయ్య, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్,సెంటర్ ఇన్చార్జి సుబ్బారెడ్డి, సి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణీపై సిబ్బందికి అవగాహన

రామసముద్రం జనవరి 22 ప్రభాతవార్త

మండలంకేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్టీ ఆర్ సామాజిక పెన్షన్ల అందజేతపై ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. స్టేట్ సెర్ప్ డైరెక్టర్ పి. రాజబాబు వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా పెన్షన్లు పై పలు విషయాలు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియ జేశారు. ఎంపిడిఓ సిబ్బందితో మాట్లాడుతూ పెన్షన్ లబ్ధిదారులు 70శాతం సంతృప్తి గా అసంతృప్తిగా 30శాతం ఉన్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించాలని సచివాలయం సిబ్బందికి సూచించారు. నాదృష్టి కి కూడ వచ్చిందని 5,6 మంది పెన్షన్ దారులను ఒక చోటికి రమ్మని పెన్షన్ లు అంద జేస్తున్నారని అ లా చేయకండన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పేదల పాలేటి వరం సీఎం సహాయ నిధి

పీలేరు జనవరి 22 ప్రభాతవార్త:



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వివిధ రకాల అనారోగ్యాల కారణం వల్ల వివిధ రకాల చికిత్స పొందిన బాధ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించిన శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది దరఖాస్తు చేసుకున్న వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా 63 చెక్కులకు గాను 91లక్షల 12వేల 253 రూపాయలు అందించారు. నిత్యం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యలు కోసం పాటుపడుతూ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తూ నియోజకవర్గ ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ, పేదలకు అందుబాటులో ఉండి ఆకలి తీర్చే ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికు బాధితులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఏఎంసి చైర్మన్ పురం రామమూర్తి, నియోజకవర్గ కూటమి, ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పాపేపల్లిలో పశు ఆరోగ్య శిబిరం

పెద్దమండెం జనవరి 22 ప్రభాతవార్త



రైతులకు సూచిస్తున్న డాక్టర్ ఉస్మాన్

మండలంలోని పాపేపల్లిలో గురువారం పశు ఆరోగ్య శిబిరాన్ని పశు వైద్యాధికారి ఉస్మాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఇందులో 24 పశువులకు గర్భకోశ వధులు నివారణ 30 పశువులకు చూడి పరీక్షలు అలాగే 106 పశువులు 559 గొర్రెలకు నట్టల నివారణ మందులను తాపినట్లు డాక్టర్ తెలిపారు పశువులకు ఏ సమస్యలు ఉన దృష్టికి తీసుకురావాలని వాటి నివారణ చర్యలు చేపడతామని డాక్టర్ ఉస్మాన్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్పెల్ బి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దమండెం జనవరి 22 ప్రభాతవార్త



8 జిల్లాల జోనల్ బి పోటీల్లో పెద్దమండ విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఎంఈఓ మనోహర్ రామకృష్ణులు అన్నారు. స్పెల్ బి పోటీలు గురువారం కడపలోనిర్వహించిన పోటీల్లో పెద్దమండెం వెలిగల్లు కు చెందిన రెండవ తరగతి విద్యార్థి బి శైలేష్ గౌడ జోనల్ ఫస్ట్ ర్యాంక్ వి గీత జోనల్ మూడవ ర్యాంకు మూడో తరగతి విద్యార్థి సాయి అనిరుద్ జోనల్ ఫస్ట్ ర్యాంక్ లో విజయం సాధించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల 31న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డిని ప్రశంసించి కృతజ్ఞతలు తెలిపారు.

## వేపూరు కోటలో ఉచిత పశు వైద్య శిబిరం

ములకలచెరువు, జనవరి22, ప్రభాతవార్త:




మండలంలోని వేపూరు కోట గ్రామం నందు గురువారం పరాగ్ డైరీ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిని రూప రైతులకు ఆయుర్వేదిక మందులు ఎలా వాడాలో అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 85 పశువులకు చికిత్సలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఏరియా డైరీ మేనేజర్ దుర్గాప్రసాద్, కన్సల్టెంట్ శివ సుబ్రహ్మణ్యం, మేనేజర్లు రెడ్డి శేఖర్ ప్రవీణ్ కుమార్, పాల స్వీకరణ ప్రతినిధి సుదర్శన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అవగాహన శిబిరం

ముద్దనూరు,జనవరి22, ప్రభాతవార్త:



పశువులలో వచ్చు సీజనల్ వ్యాధులపై గురువారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు మందులు తాపించి పలు సూచనలు సలహాలు చేశారు. ఆవులు గేదెలలో పలు రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సూర్యబాబు, శివ లింగేశ్వర రెడ్డి, లిల్లీ గ్రేస్, ధరణి, సుధీర్ కుమార్, నాగయ్య, సురేష్ బాబు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల కోసం పాటుపడతాం

కడప కార్పొరేషన్ జనవరి 22 ప్రభాతవార్త:

మహారాష్ట్రలోని షిర్డీలో 18 వ నేషనల్ కాన్ఫరెన్స్ అల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అసోసియేషన్ సమావేశానికి ఏపీ ఎన్ జి జిఓఎస్ కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడప అన్నమయ్య జిల్లాలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి షిరిడికి వెళ్తున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, కడప జిల్లా సెక్రటరీ నిత్యపూజయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సిద్దయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ పద్మనాభయ్య, సాయి అన్నమయ్య జిల్లా సహాయ అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యక్షులు మహాదేవ్, జిల్లా బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు జయచంద్ర, వరదయ్య వెళ్లారు.




## పశు సంపద అభివృద్ధికి పశువైద్య శిబిరాలు

కురబలకోట జనవరి 22 ప్రభాతవార్త.



పశు సంపద అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తోందని వాటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ .ఎం.డి .రసూల్ సాహెబ్ అన్నారు. ఈ శిబిరాల్లో భాగంగా గురువారం కురబలకోట మండలంలోని ఆర్ని కురవ పల్లి మరియు రామిగానిపల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులను సమీప గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు తోలుకొని వచ్చి తగు వైద్య సేవలను పొందాలని సూచించారు. పశువుల నివాస ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రముగా ఉంచుకోవాలని సూచించారు. ఈ శిబిరాల్లో సుమారు 121 పశువులకు విదుదల నివారణకు పిచికారిని, 27 ఆవులకు వ్యాధులకు చికిత్సలు, 263 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణకు మందులు వేసినట్లు ఆయన తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టరలు డాక్టర్ శ్రీధర్, శ్రీకాంత్ రెడ్డిలు, పశు వైద్యాధికారులు సుజనా శ్రీ, నవ్య శ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముద్దనూరు జనవరి 22,ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొసనపల్లి గ్రామ సమీపంలో గురువారం కొర్రపాడు గ్రామానికి చెందిన వ్యక్తి సంజీవ్ గొర్రెలను తీసుకొని బొలెరో వాహనంలో వెళుతుండగా ప్రమాదవశాత్తు వాహనం నుంచి క్రిందపడి గాయాలవడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందిస్తూ ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని యాక్సిడెంట్ గల కారణాన్ని పరిశీలించి ఏఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నువ్వుల పంటపై శిక్షణ కార్యక్రమం

ముద్దనూరు,జనవరి 22,ప్రభాతవార్త:



మండలంలోని రాజు గురువాయపల్లె గ్రామంలో నువ్వుల పంటపై గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ యన్ క్రిష్ణ ప్రియ నిర్వహించినట్లు స్థానిక మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నువ్వు పంట విత్తే సమయం మొదలుకొని,విత్తన శుద్ధి,కలుపు నివారణ, అంతర కృషి, ఎరువుల యాజమాన్యం,క్రిమిసంహార మందుల వాడకం,చీడ పీడలు,నివారణ చర్యలు,కోత సమయంలో పాటించవలసిన మెళకువలు మొదలగు వాటి గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించారు. తదుపరి మండల వ్యవసాయ అధికారి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడం సులభం అన్నారు. రసాయనిక ఎరువుల వాడకం సిపారసు మేరకే వాడుకోవాలి అని క్రిమిసంహారక మందులు విచ్చల విడిగా వాడరాదు అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సందీప్,నాగమణి, పకృతి వ్యవసాయ సిబ్బంది రామ సుధ,రూప,రైతు సోదరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరం

తంబళ్లపల్లె జనవరి 22 ప్రభాతవార్త ః



మండలం ఎద్దుల వారి పల్లి పంచాయతీ దిగు ముట్రవారిపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ ఆదేశాలతో గురువారం ఏ.డి డాక్టర్ సుమిత్ర,మండల అధికారి డాక్టర్ విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీలోని 165 పశువులకు బ్యూటాక్స్ పిచికారి, 36 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 106 పశువులకు నట్టల నివారణ మందులు తాపించడం జరిగింది. డాక్టర్ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 8 గ్రామ పంచాయతీలలో పశు ఆరోగ్య స్వరాలు నిర్వహించి 580 పశువులకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. మారుమూల గ్రామాలలో పాడి రైతులు సైతం పెద్ద ఎత్తున పశువులను శిబిరాలకు తరలించి పశువులకు వైద్యం పొందుతున్నట్లు చెప్పారు. ఈ పశువైద్య శిబిరంలో అంబులెన్స్ డాక్టర్ ఇందు, సహాయకులు రమేష్, శిరీష, దేవేంద్ర, పూర్ణిమ పాడి రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్

ప్రొద్దుటూరు, జనవరి 22 , ప్రభాతవార్త



ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నెహ్రు రోడ్డులోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## డ్రైనేజ్ నీరు రోడ్డుపై పారడంతో ఇబ్బందులు

మైదుకూరు, జనవరి 22, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని కడప రోడ్డు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణ నందు డ్రైనేజీ పనులు జరుగుతుండడంతో డ్రైనేజ్ కాలువ నీరు రోడ్డుపై ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు దీంతో పట్టణ ప్రజలు గత రెండు సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువల పూడికతీత తీయకపోవడంతో ఇలాంటి సమస్య ఉన్నదని చర్చించుకున్నారు. గత రెండు సంవత్సరాలుగా మున్సిపాలిటీలో కాల్వ పూడికతీత పనులు చేపట్టకపోవడంపై దోమల బెడద కూడా విపరీతంగా పెరిగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తూతూ మంత్రంగా కడప రోడ్డులో కొంతవరకు మొదలుపెట్టి మిగతా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రోడ్డుపై మురికి నీరు అవస్థలు ఉన్నాయని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా నాలుగు రోడ్ల యందు కాల్వపూడికి తీత పనులు చేపట్టి సాఫీగా మురికి నీరు పారేలా చేయడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ లోని ప్రజలు వేడుకుంటున్నారు.

## కన్నుల పండుగలా పశువుల పండుగ

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త



చౌడేపల్లిలో ఊరేగుతున్న పశువులు

మండలంలోని పలు ప్రాంతాల్లో పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. కోడె గిత్తలు పౌరుషంతో రంకెలేయగా, కుర్రకారు ఉరకలేసి వాటిని అదుపు చేసేందుకు తంటాలు పడ్డారు. మండల వ్యాప్తంగా పశువుల పండుగను కన్నుల పండుగలా జరుపుకొన్నారు. బాంధాగారాల్లో ధన్యా సాధారణంగా సంక్రాంతి తర్వాత వచ్చే గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పశువుల పండుగను జరుపుకొంటారు. ఈక్రమంలో ఉదయాన్నే ఆయా గ్రామాల్లో గ్రామదేవతలకు విశేష పూజలు జరిపారు. అనంతరం పశువులును అందంగా అలంకరించి ఊరేగించారు. సంక్రాంతిని తలపించే విధంగా ఇళ్ళముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మెలనుంచి ఆటపాటల్లో మహిళలు మునిగి పోయారు.

## గురువారం పూజలందుకొన్న షిర్డీసాయిబాబా

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో స్వామికి గురువారం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు పృద్వీనవీన్ ఆధ్వర్యంలో ఉదయాన్నే షిర్డీసాయిబాబాకు పలు రకాల పుష్పాలు, వివిధ పానీయాలతో సాంప్రదాయబద్ధంగా అభిషేకం అనంతరం అలంకరణ గావించారు. కాగడా హారతితో ఆలయం బాబా నామస్మరణతో మార్మోగింది. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు, ఉభయదారులచే పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ఆసుపత్రిలో పనిచేయని " మూడో నేత్రం "...!

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ప్రభుత్వాసుపత్రిలో మూడో నేత్రాలు(సిసికెమరాలు) పనిచేయక పోవడంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది మంది రోగులతో రద్దీగా వుండే ఆసుపత్రిలో సిసి కెమరాలు పనిచేయక పోవడం విడ్డూరంగా వుందని బహిరంగంగానే అంటున్నారు. చిన్న చిన్న దుకాణాలు, హోటళ్ళు తదితర ప్రాంతాలే సిసి కెమరాల స్వాధీనంలో వుంటే వందలాది మంది రోగులు వచ్చే ఆసుపత్రిలో సిసి కెమరాలున్నా మరమ్మత్తుకు గురయితే ఎవరూ పట్టించుకొన్న పాపాన పోలేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ప్రతి రోజూ కాన్పుకోసం గర్భవతులు వస్తుంటారు. కొందరు ఇక్కడే ప్రసవిస్తుండగా మరికొందరి పరిస్థితి విషమిస్తే బయట ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఆవరణంలో కుక్కల బెడద అధికంగా వుంది. దీంతో శిశువుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అంతే కాకుండా ఆసుపత్రి ఆవరణంలోనే ఇటీవల సిబ్బంది బంగారం వస్తువులు దొంగలించబడ్డాయి. అక్కడే వున్న మూడో నేత్రం పనిచేస్తుంటే దొంగ పట్టుబడివారు. రాత్రింబవళ్ళు రోగులతో కిటకిటలాడే ఆసుపత్రిలో సిసి కెమరాలు మరమ్మత్తుకు గురయితే పట్టించుకొనే కరువయ్యారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి కెమరాలకు మరమ్మత్తు చేయించి, ఆసుపత్రితోపాటు రోగుల భద్రత మెరగుపరచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 22 ప్రభాత వార్త

ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగనే ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటామని మాజీ సైనికుల అసోసియేషన్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు నేట్ల బాల వీరారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్లో జాతీయ వందన సమర్పణ అనంతరం గాంధీ రోడ్డు లోని గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించడం, తీపి రోడ్డులోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళ్ళు అర్పించిన అనంతరం జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తామన్నారు. కావున ప్రొద్దుటూరు, జమ్మలమడుగు,యర్రగుంట్ల పరిసరప్రాంత సైనికులు, మాజీ సైనికులు, వీరనారీమణులందరూ ఈనెల 26వ తేదీ ఉదయం 8:15 గంటలకు స్థానిక మున్సిపల్ గ్రౌండ్ కు చేరుకోవాలని కోరారు.

## హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

సోమల జనవరి 22 (ప్రభాతవార్త)



10 సంవత్సరాల క్రితం ఇరికిపెంట పంచాయితీ ఎర్ర మిట్టలో జరిగిన దారుణ హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మదనపల్లి రెండవ అదనపు జిల్లా సెషన్ కోర్టు తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి ఎర్ర మిట్టకు చెందిన కమలమ్మకు వీరపల్లి శ్రీనివాస నాయుడుకు భూతగాద ఉంది. ఈ క్రమంలో 2016 జనవరి 16వ తేదీ కమలమ్మ ఆమె కుమార్తెలు పొలం వద్ద ఉండగా ముందుగానే కత్తితో అక్కడికి వచ్చిన శ్రీనివాస నాయుడు ఆమెపై కత్తితో దాడి దిగాడు. దీంతో తీవ్ర గాయాలైన కమలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సోమల పోలీసులు హత్య కేసును నమోదు చేసి శ్రీనివాసన్ నాయుడు గంగులమ్మలను ముద్దాయిలుగా చూపారు. 10 సంవత్సరాల పాటు కేసు కోర్టులో నడిచింది. గురువారం కోర్టు తీర్పు వెలబడింది నిలబడింది. శ్రీనివాసులు నాయుడుకు యావజ్జీవ కారాగార శిక్ష మరియు గంగులమ్మకు 12వేల రూపాయలు జరిమానా తో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందిముద్దాయిలను మదనపల్లి సబ్ జైలుకు తరలించారు.

## పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ

కేవీ పల్లె జనవరి 22 ప్రభాతవార్త:



మోడల్ పేపర్స్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

2025, 26 సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థినిలకు 3000 రూపాయలు విలువ కలిగన మోడల్ టెస్ట్ పేపర్స్ ను కె.వి.పల్లి మండలం జి.కొత్తపల్లి ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు యుటిఎఫ్ నాయకులు అందించారు .ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే మోడల్ టెస్ట్ పేపర్స్‌ను యుటిఎఫ్ నాయకత్వం రచించిందని గత ఎస్ఎస్సి పరీక్షలలో కూడా 60 నుండి 70 శాతం పైన ప్రశ్నలు యుటిఎఫ్ మోడల్ పేపర్స్ నుంచి వచ్చాయన్నారు. విద్యార్థులు ఎస్ఎస్సి పరీక్షలలో ఉత్తీర్ణులు కావడానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. మండల విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగకరమైన మెటీరియల్ అని వాటిని సద్వినియోగం చేసుకోని మంచి మార్కులతో పాసై ఇటు పాఠశాలకు ఉపాధ్యాయులకు అటు మండలానికి మంచి పేరు తేవాలని అలాగే జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ డి.వెంకటరమణా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానంతో సమానం

బద్వేల్ అర్బన్ జనవరి 22 ప్రభాతవార్త :



గురువారం సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ఓ వ్యక్తికి ఆపరేషన్‌కి ఏ నెగిటివ్ రక్తం అత్యవసరం కాగా విషయం తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యులు మైలపల్లి సుబ్రహ్మణ్యం ద్వారా సకాలంలో అతనికి రక్తదానం చేయడం వలన వారి ఆపరేషన్ సుఖవంతంగా జరిగింది, సకాలంలో రక్తదానం చేసిన మైలపల్లి సుబ్రహ్మణ్యంను సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కోటా సుమన్, షుగర్ వ్యాధి నిపుణులు వై,వి సరస్వతి మరియు పలువురు డాక్టర్స్ ఆ యువకుడిని అభినందించారు. అత్యవసర సమయాల్లో ఎవరికైనా రక్తం అవసరమైనప్పుడు ప్రజలందరూ కూడా ముందుకు వచ్చి సకాలంలో రక్తదానం చేయాలని వారు పలువురికి కోరారు, ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ గ్రూప్ అడ్మిన్ వల్లంకొండు రాఘవేంద్ర మరియు హాస్పిటల్ సిబ్బంది సుబ్బరాయుడు తోపాటు పలువురు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

సుండుపల్లె, జనవరి 22,ప్రభాతవార్త :




సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు విద్యార్థుల రాకపోకలకు అవస్థలు పడుతున్న విద్యార్థులు గురువారం ప్లకార్డులతో రోడ్డుపై నిరసన తెలుపుతూ బయటాయించారు. పింఛా వైపు వస్తున్న ఆర్టీసీ బస్సులు సమయపాలన లేకపోవడంతో పెదినేకలువ, చెరుకువండ్లపల్లి, ముదుంపాడు,కురవపల్లి గ్రామాలకు చెందిన పాఠశాల విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు ఉండడంతో విద్యార్థులు రోడ్డుపై ప్లకార్డులతో బైఠాయించి నిరసన చేపట్టారు. బస్సులు ఆలస్యంగా రావడం,ఒకో రోజు పూర్తిగా రాకపోవడం వల్ల విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా చేరడం,కొన్నిసార్లు హాజరు కాకుండా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం తప్పకుండా ఆర్టిసి బస్సులు సమయపాలన పాటించి ఉదయం 8:40 గంటలలోపు బస్సు తప్పనిసరిగా పింఛా చేరుకునేలా, సాయంత్రం 4:00 గంటలకు పింఛా నుంచి బయలుదేరేలా స్థిరమైన సమయపాలన అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ మేనేజర్ స్పందించి,పాఠశాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బస్సులను క్రమబ ద్ధంగా నడపాలని,లేకపోతే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వ అధికారులకు హెచ్చరించారు.

# రూ.70కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి : ఎమ్మెల్యే


సింగల్‌విండో కార్యాలయంలో రిబ్బన్‌కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

**నిమ్మనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :**
మదనపల్లె నియోజకవర్గంలో దాదాపు 18నెలల కాలంలో రూ.70కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం నిమ్మనపల్లె మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేసి సిఎం సహాయం నుంచి మంజూరైన చెక్కులను ఆయా గ్రామాల్లో లబ్ధిపొందిన వారికి స్వయంగా అందజేశారు. స్థానిక సింగల్‌విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని నూతనంగా ఎన్నికైన సింగల్‌విండో అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, డైరెక్టర్లు చెంద్రాయుడు, చిన్నబాబుల ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారాన్ని క్లస్టర్ ఇన్‌చార్జ్ వసంత మునిరత్నం నూతనంగా ఎన్నికైన వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సింగల్‌విండోలో రుణాలు పొంది సకాలంలో చెల్లించి లబ్ధిపొందాలన్నారు. సింగల్‌విండో సిఈఓ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ బ్యాంకుద్వారా చేపడుతున్న రైతులకు బంగారు రుణాల పంపిణీ, రైతులకు సరసనమైన ధరలతో ఎరువుల పంపిణి, రైతులకు సకాలంలో రుణాల పంపిణీల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రాజన్న, నూతనంగా ఎన్నికైన సింగల్‌విండో అధ్యక్షులు వెంకటరమణ, డైరెక్టర్లు చెంద్రాయుడు, చినబాబు, సింగల్‌విండో మాజీ అధ్యక్షులు ఆర్‌జె.వెంకటేష్, తహశీల్దార్ తపశ్విని, ఆర్ఐ రమేష్, ఎంపిడిఓ పక్రుద్దీన్‌సాహెబ్, ఏఓ రమేష్, ఏపిఓ రమేష్, మాజీ ఎంపిపిలు రెడ్డప్పరెడ్డి, అంగజాల పారిజాత, మాజీ జడ్పిటిసి సుజాత, వసంత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగల్‌విండోలోని అధ్యక్ష కార్యాలయానికి ఆయన రిబ్బన్‌కటింగ్ చేశారు. పలువురికి సిఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు.

## పురాతన తెలుగు శాసనం గుర్తింపు



**సిద్ధవటం జనవరి 22 ప్రభాతవార్త**
మండలంలోని టక్కోలి గ్రామానికి తూర్పు దిశగా ఉన్న శివాలయంలో మరో పురాతన తెలుగు శాసనాన్ని గుర్తించినట్లు దక్షిణ భారత పర్యాటక సంస్థ జిల్లా అధ్యక్షుడు జ్యోతి జార్జి, కార్యదర్శి మురికి నాటి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పెన్నానది ఒడ్డున ఉన్న మాచుపల్లి, ఖాదర్ బంగ్లా బ్రిడ్జికి సంబంధించిన పునాది శిలాఫల కాన్ని సందర్శించిన అనంతరం మాచుపల్లిలోని " శ్రీ రేణుకా ఎల్లమాంబ దేవాలయంను దర్శించుకున్నారు. ఇందులో బాగంగా టక్కోలి గ్రామానికి చెందిన శివాలయంను సందర్శించగా అక్కడ ప్రాచీన తెలుగు శాసనాన్ని గుర్తించినట్లు తెలిపా రు.ఇలాంటి పురాతన కాలం నాటి ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.సిద్ధవటం ప్రాంతంలో పూర్వం శైవ మతం వర్ధిల్లినట్లు చెప్పారు. టక్కోలి శివాలయ శాసనంలోని సారాంశం కోసం మైసూర్‌లోని ప్రాచీన శాసనాల పరిశీలనా సంచాలకులు (డైరెక్టర్ ) ఆచార్య మునిరత్నం రెడ్డికి కూడా పంపండం జరిగిందని చెప్పారు.

## రైతు సంక్షేమమే ఎన్‌డీఏ ప్రభుత్వ ధ్యేయం

**: మార్కెట్‌యార్డు చైర్మన్ సుప్రజ**




**బద్వేలు, జనవరి 22(ప్రభాతవార్త):**
రైతు సంక్షేమం కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం పాటుపడుతుందని మోడి అహర్నిషలు రైతులకు సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసేందుకు ఎప్పటికప్పుడు నూతన ఒరవడి సృష్టిస్తున్నారని మార్కెట్‌యార్డు చైర్మన్‌సుప్రజ అన్నారు. గోపవరం మండల సరసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ బద్వేలు మార్కెట్‌యార్డులో నూతనంగా నిర్మితమైన రైతు బజార్ ఇటు రైతులకు, అటు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రతి రైతు సేవా కేంద్రం కనీస మద్దతు ధర పట్టిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు పంట నమోదు చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్దతు ధర పైన పంటల సంక్షేమ విషయంలో వెనకడుగు వేయకుండా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ వ్యవసాయ అధికారులు, సి బ్బంది గ్రామాలలో తిరిగి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. బద్వేలు మార్కెట్‌యార్డులో నూతన విదానాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అతి త్వరలో యార్డులో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులతో సమన్వయమై రైతులకోసం ఏర్పాట్లు చేస్తామన్నారు.

## అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్‌జట్టు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

**మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :**
పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్‌జట్టు ఎంపిక నిర్వహించారు. జేఎన్‌టియు అనంతపురం పరిధిలోని అంతర్ విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టు ఎంపిక ట్రైయల్స్‌ను ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ టి.నారాయణరెడ్డి, కార్యదర్శి స్పోర్ట్స్ కౌన్సిల్ జెఎన్‌టియు అనంతపురం హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గౌరవ అతిధిగా డాక్టర్ సి.సతీష్‌కుమార్, స్పోర్ట్స్ కౌన్సిల్ బోర్డు సభ్యులు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ పాల్గొన్నారు. ఈఎంపిక ట్రైయల్స్‌లో జేఎన్‌టియు ప్రాంతానికి చెందిన 50కళాశాలల నుంచి సుమారు 80మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ ఆధారంగా 16మంది ప్రధాన క్రీడాకారులు, ఆరుమంది స్టాండ్ క్రీడాకారులుగా ఎంపిక అయ్యారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాముడులు అభినందించారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 23నుంచి 27వరకు ఆదిత్య కళాశాలలో ప్రత్యేక శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# బద్వేలులో సఖి సురక్ష కార్యక్రమాలు విజయవంతం



**బద్వేలు అర్బన్ ,జనవరి 22 , ప్రభాతవార్త**
నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ సహకారంతో బద్వేల్ పురపాలక సంఘ పరిధిలోని కోటవీధి సురేంద్రనగర్, గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లలో సఖి సురక్ష కార్యక్రమాలు గురువారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్వేల్ రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్, బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సఖి సురక్ష కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా మూడు రకాల స్క్రీనింగ్ పరీక్షలు, మొత్తం 16 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఆధునిక యంత్ర సామగ్రితో వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సేవలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులతో అనుసంధానం చేసి చికిత్సకు సిఫార్సులు చేస్తారని పేర్కొన్నారు. అలాగే రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధుల పరీక్షలతో పాటు రక్తహీనత, విటమిన్, ప్రోటీన్ లోపాలు, మహిళలకు సంబంధించిన క్యాన్సర్ల ముందస్తు గుర్తింపు, మానసిక ఆరోగ్య సమస్యలపై కౌన్సిలింగ్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డు, రూ.5 లక్షల వరకు ఆరోగ్య భీమా కవరేజ్, అవసరమైన సందర్భాల్లో రిఫరల్ సౌకర్యం, టెలీ కన్సల్టేషన్ సేవలు కనీసం నాలుగు సార్లు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమ మూడు అర్బన్ హెల్త్ సెంటర్లలో కలిపి 1229 మంది నమోదు చేసుకోగా, 1191 మందికి రక్త నమూనాలు తీసుకుని పరీక్షలు పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులతో పాటు మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్‌సిసి సర్టిఫికెట్ల ప్రధానం


విద్యార్థులకు ఎన్ సి సి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎల్లారెడ్డి

**రాజంపేట,జనవరి 22 ప్రభాతవార్త**
స్థానిక అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఎన్సీసీ విద్యార్థులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం అనంతరం గురువారం సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. విద్యార్థులకు బి, సి సర్టిఫికేట్ పరీక్షలకు సిద్ధం చేసే ఉద్దేశంతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణను 5 ఆంధ్ర బెటాలియన్ ఎన్సీసీ తిరుపతి నుంచి వచ్చిన నాయబ్ సుబేదార్ ఎన్.కే.ఝా, హవల్దార్ కె. హరి కృష్ణ విద్యార్థులకు సమర్థవంతంగా అందించారు. రాబోయే నెలలో నిర్వహించనున్న ఎన్సీసీ బి ,సి సర్టిఫికేట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని, డ్రిల్, థియరీ, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, లీడర్‌షిప్ నైపుణ్యాలు వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొత్తం 95 మంది ఎన్సీసీ బాలికా క్యాడెట్లు పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. అలాగే మార్చి 2025లో నిర్వహించిన ఎన్సీసీ బి సర్టిఫికేట్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని అన్నమాచార్య విశ్వవిద్యాలయం అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎన్. దీప్తి, ఫిజికల్ డైరెక్టర్ డా. బి. నాగముని పర్యవేక్షణలో నిర్వహించారు. విద్యార్థులకు ఏఐటిఎస్ వై చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి ,ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పేరుతో అక్రమాలకు తెర



**ఎడ్యుకేషన్ జనవరి 22 ప్రభాతవార్త :**
జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై విచారణ జరిపించాలని కోరుతూ గురువారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో వైయస్సార్ కడప జిల్లా కేంద్రంలో ఇంటర్ ప్రాంతీయ అధికారి ఆర్ఐఓ వెంకటేశ్వర్లకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 27 తేదీ నుండి అన్ని జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం నేపథ్యంలో జిల్లాలో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మార్కులు అధికంగా వేస్తామని చెప్పి ఒక్కో విద్యార్థులు దగ్గర వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కావున కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నాయకుడు మనోజ్,ఉషమా, గఫార్ అహ్మద్, శివ , చందు, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం



**రాయచోటి టౌన్ జనవరి 22 ప్రభాతవార్త**
జాతీయ రహదారి భద్రతా మాసం2026 లో భాగంగా, రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా మదనపల్లె పట్టణంలో రోడ్ సేఫ్టీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాక్ థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం తదితర రహదారి భద్రతా చర్యల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ భద్రతా చర్యలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలియజేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా, అన్నమయ్య జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కే. ప్రసాద్, జిల్లా రవాణా అధికారి డిటిఓ ఎస్. మహేంద్ర, డిఎస్పీ . అశోక ప్రతాప్ రావు, ఆర్టీఓ, దినేష్ చంద్ర, ఎంవీఐ శివలింగయ్య, ఏఎంవీఐ శ్రీహరి, ఏఎంవీఐ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 16 అడుగుల శ్రీ సత్తెమ్మ తల్లి విగ్రహావిష్కరణ


అమ్మ వారి ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే

**పీలేరు జనవరి 22 ప్రభాతవార్త :**
నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో శ్రీ సత్యమ్మ తల్లి విగ్రహావిష్కరణ నిర్వహించారు. గండబోయినపల్లిలోని శ్రీ సత్యమ్మ తల్లి కోట ఆవరణలో 16 అడుగుల ఎత్తైన శాంతి స్వరూపంలో, భక్తులకు అభయహస్తం ప్రసాదిస్తున్న శ్రీ సత్తెమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ గురువారం నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి శ్రీ సత్తెమ్మ తల్లి విగ్రహాన్ని భక్తుల మధ్య ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ దేవతల ఆలయాలు గ్రామ ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. భక్తుల కోరికలు నెరవేరాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ సత్తెమ్మ తల్లిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణకు ముందుగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్ పులి సత్యనారాయణ రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్యాండ్ మేళాలు, టపాసాల మోతలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యేకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమోళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి సద్దల చక్రపాణి, సభ్యులు ప్రభాకర్ రెడ్డి, అమర్నాథ రెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కంభం దామోదర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, టీడీపీ నాయకులు విఠలం శ్రీధర్ రెడ్డి, కోసూరి రమేష్, చింతపర్తి శేషాద్రి రెడ్డి, ఉపాధ్యాయిని కళ్యాణి, శంకర, కృపాల్, విగ్రహ దాతలు సద్దల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇస్కాన్ 60 సంవత్సరాల సంబరాలు



**పులివెందుల జనవరి 22 , ప్రభాతవార్త :**
పట్టణంలో వసంత పంచమి రోజున ఇస్కాన్ 60 సంవత్సరాల సంబరాలను విజయవంతం చేయాలని ఇస్కాన్ ప్రతినిధులు రాధా మనోహర్, రాఘవ గోస్వామి దాస్‌లు అన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 3.30కి తిరుపతి ఇస్కాన్ ఆధ్వర్యంలో పులివెందులోని పాత బస్టాండ్ దగ్గర నుండి వాసవి కళ్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ ఉంటుందనీ అనంతరం పులివెందులోని అలవల పాడు రోడ్డులో గల వాసవి కళ్యాణ మండపంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్‌లో భాగంగా సాయంత్రం 4 గంటలకి సరస్వతి పూజ మరియు పిల్లలకు భగవద్గీత ఆధారంగా కార్యక్రమాలు మరియు ప్రత్యేకమైన ప్రసంగం ఉంటుందని తిరుపతి ఇస్కాన్ ప్రతినిధులు రాధా మనోహర్ దాస్, రాఘవ గోస్వామి దాస్, శ్రీకృష్ణ కాంతదాస్, నాగరాజు, గోవర్ధన్ విహారి దాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులు శ్రీమాన్ రేవతి రామన్ దాస్,శ్రీమాన్ రాధా మనోహర్ దాస్ లు రా నున్నారు అని కార్యక్రమం అనంతరం భోజనప్రసాదం ఉంటుందనీ కావున తల్లిదండ్రులు తమ పిల్లలతో మరియు ఆత్మ బంధువులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయ వలసిందిగా పిలుపునిచ్చారు.

## టెక్నాలజీలపై అవగాహన ఆవశ్యం




**కురబలకోట జనవరి 22 ప్రభాతవార్త.**
అంతర్జాతీయ పరిశోధన సంస్థలలోని నూతన టెక్నాలజీలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇస్రో మాజీ శాస్త్రవేత్త కిస్సేట్ డైరెక్టర్, భారత అంతరిక్ష విభాగానికి చెందిన ఇన్ స్పేస్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ బివి సుబ్బారావు అన్నారు. గురువారం కురబలకోట మండలం అంగళ్ళ సమీపంలోని మిట్స్ డీమ్డ్.టు. బి.యూనివర్సిటీ లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు అంతరిక్ష కేంద్రంలోని రాకెట్ లాంచ్ బేస్ స్టేషన్ల కోసం రేంజ్ సిస్టమ్స్ అనే అంశముపై అతిగా ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాకెట్ ప్రయోగం సమయములో దాన్ని దూరం, దిశ కదిలికలను గుర్తించే రేంజ్ సిస్టమ్స్ ఎలా పనిచేస్తాయి అని విద్యార్థులకు వివరించారు. రాకెట్ ప్రయాణాన్ని నిరంతరం గమనిస్తూ అవసరమైన సమాచారాన్ని లాంచ్ బేస్ స్టేషన్‌కు పంపించి రాకెట్ నిర్వహించిన మార్గంలోనే వెళ్తుందా లేదా అన్నది తెలుసుకోవడానికి ఈ వ్యవస్థలు ఉపయోగపడతాయని తెలిపారు. ఏదైనా లోపం వచ్చినప్పుడు వెంటనే గుర్తించి ప్రమాదాలను నివారించడంలో ఇవి సహాయపడతాయన్నారు. ఉపగ్రహాన్ని సరైన కక్షలో ప్రవేశ పెట్టేందుకు రేంజ్ సిస్టమ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఎం శ్రీదేవి, కోఆర్డినేటర్స్ డాక్టర్ ఆర్ విద్య ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం 21 వ వార్షికోత్సవం వేడుకలు

**2 రోజులపాటు కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు**



**బద్వేల్ అర్బన్ జనవరి 22 ప్రభాతవార్త :**
పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో వెలిసిన శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం 21,వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 23,తేది శుక్రవారం నుండి శనివారం వరకు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని సబ్ జైల్ సూపర్డెంట్ శ్రీహరి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పద్మావతి మెడికల్‌స్టోర్ దర్శి సుబ్బరాజా,వూరిబ్నిడి మనోహర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, బీరం రవిశంకర్‌రెడ్డి, వడ్లపూడి నాగభూషణంతోపాటు పలువురు కమిటీ సభ్యులు తెలిపారు, ఈ సందర్భంగా గురువారం సాయంత్రం వార్త విలేకరితో పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను రెండు రోజులు పాటు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు, మొదటిరోజు శుక్రవారం సాయంత్రం 4:30 నుండి బద్వేల్ టౌన్ నెల్లూరు రోడ్ అయ్యప్ప దేవస్థానం నుండి 108 కలిశాలతో శోభాయాత్ర, శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ తదుపరి శ్రీ దుర్గా మాతకు 108 కలశాలతో 9 నదుల జ్వాలాలతో పంచామృతాలతో బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక అభిషేకం ఉదయం 6, గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం 9 గంటల నుండి చండీ హోమం, మహా మంగళహారతి ఆశీర్వచనం కలదన్నారు, అనంతరం సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రీతికరమైన 21 రకాల పుష్పాలతో పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు, కావున పట్టణ పరిసర ప్రాంత భక్తాదులందరూ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. ఉత్సవాలుకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**వేడుకలను జయప్రదం చేయాలి :**



శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం 21,వ వార్షికోత్సవ వేడుకల్లో భక్తాదులందరూ విరివిరిగా పాల్గొని కనకదుర్గమ్మ అమ్మవారి ప్రత్యేక హోమాలు అభిషేకాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం శ్రీ దుర్గా సమేత మల్లేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలను కనుల పండగగా నిర్వహించడం జరుగుతుంది, కావున భక్తాదులందరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని జరగబోయే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మనవి చేయడమైనది.

**ఆలయ పురోహితులు పీ, ప్రదీప్ కుమార్ శర్మ బద్వేల్.**

## నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు జనవరి 22 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు మండల పరిధిలోని కామనూరు గ్రామంలో 29 30 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మా సోదరులు నంద్యాల రాఘవరెడ్డి మరియు గ్రామ పెద్దల సహకారంతో అన్ని రకాల సౌకర్యాలతో విద్యార్థులకు నూతన భవనాన్ని పటిష్టంగా నిర్మించడం సంతోషకరమన్నారు. పాఠశాల భవనంతో పాటు ఆవరణలో కూడా పిల్లలు ఆటలాడుకునేందుకు సౌకర్యవంతంగా ఉందన్నారు. ఈ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి స్థానాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ లక్ష్మణ్ కామనూరు గ్రామ సర్పంచ్ షేక్ చెట్టూరు షమీం మాజీ సర్పంచ్ శివ నాగిరెడ్డి టిడిపి నాయకులు చంద్రశేఖర రెడ్డి గౌస్ లాజం మరియు విద్యాశాఖ మండల అధికారులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**సదుం జనవరి 22 ప్రభాతవార్త :**
సదుం పోలీస్ స్టేషన్ ఎస్సై విష్ణు నారాయణ మరియు శక్తి టీం సభ్యులతో కలిసి సదుం వినాయక జూనియర్ కళాశాల లో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్, పోక్స్ కేసులు, హెల్మెట్ వినియోగం గురించి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసరంగా సెల్ ఫోన్ లో వచ్చే లింకులను ఎవరు ఆన్ చేయకూడదన్నారు. దానివల్ల మన ఖాతాలో ఉన్న సొమ్ము ఇతరులకు అప్పనంగా వెళ్ళిపోతుందని చెప్పారు. దానితోపాటు డ్రగ్స్ వినియోగించడం చాలా ప్రమాదకరమన్నారు. దీనివల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని చెప్పారు అదేవిధంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏ ఎస్సైసత్యనారాయణ శక్తి టీం సభ్యులు సుధాకర్, శోభ మరియు ఇతర పోలీస్ సిబ్బంది కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఏపీఐఐసీ భూముల రైతులకు న్యాయం చేస్తాం.



**తంబళ్లపల్లె జనవరి 22 ప్రభాతవార్త ః**
మండలంలోని రెడ్డి కోట, కుక్క రాజు పల్లి ప్రాంతంలో ప్రభుత్వం ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి ఇప్పటికే 20 ఎకరాలు ప్రభుత్వ భూమి సేకరణతో పాటు మరో 40ఎకరాలు 33 మంది రైతుల డికెటి భూములను ఎంపిక చేయడం జరిగిందని ఆ డీకేటి భూముల రైతులు అందరికీ న్యాయం ప్రభుత్వపరంగా చేస్తామని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి హామీ ఇచ్చారు. ఈ భూముల విషయమై గత రెండు నెలల క్రితం భూముల లబ్ధిదారులు రెడ్డి కోట వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఈ భూముల విషయమై గురువారం తాసిల్దార్ కార్యాలయంలో ఏపీఐఐసీ భూముల లబ్ధిదారులతో సబ్ కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించి అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రైతులు సమన్వయం పాటించి భూములు ఇవ్వడానికి సహకరించాలని, పరిహారం ఎంత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు ఈ భూమి జీవనాధారమని ఈ భూములు పోతే ఎలా బతకాలని ఫిర్యాదు చేసి ససేమిరా అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి సిద్ధపడిందని మీరు పెద్ద మనసుతో ముందుకు రావాలని వచ్చే బుధవారం మరో మారు చివరి అవకాశం రైతులకు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాశీల్దారు శ్రీనివాసులు, ఆర్ ఐ ముద్దు కృష్ణ, వీఆర్వోలు సంజీవ్, నాగరాజు రైతులు పాల్గొన్నారు.

## ఉచిత పశుఆరోగ్య శిబిరాలు విజయవంతం



**కలికిరి, జనవరి 22, ప్రభాతవార్త:**
మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ గాజులబండ కురవపల్లెలోనూ, మొరంకిందపల్లె పంచాయతీల్లో గురువారం జరిగిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు విజయవంతమయ్యాయి. ఈ సందర్భంగా పశువులకు, గొర్రెలకు నట్టల నివారణ మందును వేశారు. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, అలాగే పశువులకు సాధారణ వ్యాధి చికిత్సలు చేయడం జరిగింది. కలికిరి పశువైద్యశాల సహాయ సంచాలకులు డా.వెంకట మునినాయుడు పశుపోషణపైన పునరుత్పత్తిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పశువైద్యాధికారులు డా.గిరినాథ్‌రెడ్డి, డా.జగన్‌మోహన్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్లు పవన్‌కుమార్, కృష్ణవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 24, 25 తేదీలలో
# గండికోట సాంస్కృతిక మహోత్సవాలు

**నందలూరు, జనవరి 22 ప్రభాత వార్త :**
ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సృజనాత్మక సమితి సౌజన్యంతో, తెలుగుకళావేదిక సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీలలో గండికోట సాంస్కృతిక మహోత్సవాలను కడప నగరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు, నాట్యాచార్యులు, సాహితీవేత్త డా. కోడూరు సుమనశ్రీ వెల్లడించారు. కడప నగరంలోని సి.పి. బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరం వేదికగా రెండు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలు జిల్లాలోని సాహిత్య–సాంస్కృతిక వేదికకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలిపారు. 24వ తేదీన సంగీత కార్యక్రమాలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, స్థానిక కవి సమ్మేళనం నిర్వహించనుండగా, 25వ తేదీన శతాధిక కవిసమ్మేళనం, విశిష్ట వ్యక్తులకు గౌరవ సత్కారాలు, పురస్కారాల ప్రదానం జరగనున్నాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని గండికోట సాంస్కృతిక మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.